రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (గురువారం సాయంత్రం) సహర్: 4:44 (శుక్రవారం ఉదయం)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
గురువారం, 27 మార్చి 2025





- శిథిలాల్లో ఇద్దరు మేస్త్రీలు, నలుగురు కార్మికులు ఉన్నట్టు అనుమానాలు
- నిటారుగా కూలడంతో ఇరుగు పొరుగు వారికి తప్పిన ప్రమాదం
- రంగంలోకి సింగరేణి రెస్క్యూ బృందం..
- సహాయక చర్యలు షురూ
- 35 ఏళ్ల నాటి భవనం పునాదులపై సామర్థ్యానికి మించి నిర్మించడం వల్లే ప్రమాదం
- ఇంజనీరింగ్ నిపుణుల పర్యవేక్షణ లేకుండానే పనులు
- నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నా.. పట్టించుకోని అధికారులు

ఉలిక్కిపడిన భద్రాద్రి

నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం కుప్పకూలడంతో భయాందోళనలు

భవన శిథిలాల్లో చిక్కుకున్న ఉపేందర్‌రావు, కామేష్


రోదిస్తున్న ఉపేందర్‌రావు భార్య


పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

భద్రాచలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం నడిబొడ్డున నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలిన సంఘటన తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. ఇంజనీరింగ్ నిపుణుల పర్యవేక్షణ లేకుండా సాధారణ మేస్త్రీలతో అక్రమంగా నిర్మించడం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్టు భావిస్తున్నారు. భద్రాచలంలోని సూపర్‌బజారు సెంటర్ సమీపంలోని పోకలవారి వీధిలో శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టుకు చెందిన శ్రీవిజయ కనకదుర్గ భవానీ దేవస్థానం భద్రాద్రి భవానీ పేరుతో భవన (గుడి) నిర్మాణం చేపట్టారు. జీ ప్లస్ 5 అంతస్తులతో పనులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఐదు అంతస్తుల స్లాబ్ పూర్తికాగా, ఆరో అంతస్తుకు ఇటీవలె స్లాబ్ వేశారు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భవనం ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనతో భద్రాచలం పట్టణం వణికిపోయింది. భవన శకలాల్లో ఇద్దరు తాపీ మేస్త్రీలు చిక్కుకున్నట్టు వారి కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. వారిని భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన పడిచాల ఉపేందర్‌రావు, (మిగతా 6వ పేజీలో)

పక్కకు ఒరిగి ఉంటే...

హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతల మాదిరిగా భద్రాచలంలో జీ+5తో ఉన్న భవనం పేకమేడలా కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక వేళ ముందుగాని, పక్కన కాని ఆ భవనం పడి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేకమేడలా ఒకే వరుసలో కిందకు కుప్పకూలడంతో ఇరుగుపొరుగున వున్న వారికి ప్రాణ నష్టం జరగలేదు.

శిథిలాల్లో కామేష్ అలికిడి..

కుప్పకూలిన భవన శిథిలాల నుంచి మేస్త్రీ కామేష్ నుంచి అరుపులు వినిపిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కామేష్‌ను ప్రాణాలతో బయటకు తీసుకురావడానికి అన్ని చర్యలు చేపట్టారు. కుప్పకూలిన స్లాబ్‌కు రంధ్రం చేసి దాని ద్వారా కామేష్ వున్న చోటుకు ఆక్సిజన్, మంచినీటిని పంపించారు. శిథిలాలను తొలగిస్తున్నామని, భయపడవద్దని కామేష్‌కు ధైర్యం చెబుతున్నారు. బుధవారం అర్ధరాత్రి వరకు కూడా రెస్క్యూ చర్యలు కొనసాగుతూనే వున్నాయి. అయితే కామేష్‌తోపాటు శిథిలాల్లో చిక్కుకున్న మరో మేస్త్రీ ఉపేందర్‌రావు నుంచి ఎలాంటి అలికిడి వినిపించలేదని తెలిసింది.


రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న సింగరేణి బృందం


శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

మంత్రుల శాఖల్లో మార్పులు!?

కేబినెట్ విస్తరణ నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ



ఖమ్మం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉగాది పండుగకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, ప్రస్తుతం మంత్రులు నిర్వహిస్తున్న శాఖల్లో మార్పులు చోటుచేసుకుంటాయని భావిస్తున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల శాఖలపై చర్చసాగుతోంది. ప్రస్తుతం ఉన్నశాఖలు యథావిధిగా కొనసాగుతాయా? లేక కొత్తశాఖలు అదనంగా చేరుస్తారా అన్నదానిపై పలు ఊహాగానాలు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రితో పాటు ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క కొనసాగుతున్నారు. ఖమ్మంనుంచి గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. పాలేరు నుంచి గెలుపొందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు కీలకశాఖలు నిర్వహిస్తూ వస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ, రాష్ట్ర విభజన తర్వాత ఒకే మంత్రి ఇన్ని (మిగతా 6వ పేజీలో)

ఆడపిల్లే పుట్టాలని కోరుకుంటాను...

- అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను ప్రోత్సహించాలి
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- 'మా పాప-మా ఇంటి మణిదీపం' కార్యక్రమానికి శ్రీకారం
- రామచంద్రాపురం తండాలో ఆడశిశువు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు

తల్లాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టడం అదృష్టమని, ఆడపిల్ల పుడితే తల్లిదండ్రులకు స్వీట్‌బాక్సును అందించి శుభాకాంక్షలు తెలిపే కార్యక్రమం 'మా పాప-మా ఇంటి మణిదీపం'ను ప్రారంభించటం చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మంజిల్లా తల్లాడ మండలం రామచంద్రాపురం తండాలో బుధవారం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రామచంద్రాపురం తండాలోని బానోతు కృష్ణవేణి-భరత్‌నాయక్ దంపతులకు ఈ నెల ఒకటిన ఆడపిల్ల జన్మించింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్వీట్ బాక్సు, డ్రెస్, పండ్లు, అభినందన పత్రాన్ని కుటుంబానికి అందించి శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగవంతుడు అవకాశం ఇస్తే తనకు ఆడపిల్ల పుట్టాలని కోరుకుంటానని, ఆడపిల్లలు చూపించే ప్రేమ అమూల్యమైందన్నారు. చదువుల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు బాగా రాణిస్తున్నారని, ప్రతి తరగతిలో మొదటి మూడు స్థానాల్లో అమ్మాయిలే ఉంటున్నారని కలెక్టర్ తెలిపారు. పుట్టిన ఆడపిల్లలకు మగ పిల్లలతో సమానంగా విద్య, వ్యాపార, ఆస్తి అవకాశాల్లో భాగం కల్పించాలన్నారు. అమ్మాయిలు ఆశించిన మేరకు చదువుకున్న తర్వాత ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిరపడి సొంత ఆదాయ వనరులు సంపాదించుకున్న తర్వాత మాత్రమే పెళ్లి గురించి ఆలోచించాలని, ఆడపిల్లల భావాలకు గౌరవం ఇవ్వాలని కలెక్టర్ కోరారు. సునీత విలియమ్స్ అనే మహిళ విజయవంతంగా అంతరిక్షంలో ఉండి వచ్చారని, అంతరిక్షంలో మహిళలు అడుగుపెట్టిన నేటి హైటెక్ యుగంలోనూ కొంతమంది ఆడపిల్లలపై వివక్ష చూపటం దురదృష్టకరమన్నారు. జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా.. జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్సు అందజేసి శుభాకాంక్షలు తెలపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి అత్త ఇందిర మాట్లాడుతూ కలెక్టర్ తమ ఇంటికొచ్చి మా అమ్మాయిని ఆశీర్వదించటం గొప్ప అనుభూతి అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, ఆర్డీవో రాజేంద్రగౌడ్, మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్, డీహెచ్ ఈఈడబ్ల్యూ సమ్రీన్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సురేష్ బాబు, ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్, మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ తదితరులు పాల్గొన్నారు.


శిశువును ఎత్తుకున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మైనింగ్ కళాశాలను వర్సిటీగా మార్చాలి...

- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల వినతి
- సానుకూలంగా స్పందించిన సీఎం



కొత్తగూడెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలోని కేయూ మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో బుధవారం లేఖను అందజేశారు.

ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే అత్యున్నత కళాశాల అని, యూనివర్సిటీగా మారిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. దాదాపు 400ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఉందని, 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మారిస్తే వేలాది మంది శాస్త్రవేత్తలను తయారు చేయవచ్చన్నారు.

కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్ పర్యవరణ హితం కోసం శాస్త్రవేత్తలను తయారుచేయడం కోసం యూనివర్సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. మైనింగ్ కళాశాలను యూనివర్సిటీగా మారిస్తే వేలాది మంది విద్యార్థులు శాస్త్రవేత్తలుగాను, పలువురికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎర్త్ సైన్సెస్ వర్సిటీతో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలాజీ, జియోమేరపాలజి, స్ట్రక్చర్ జియాటజీ, ఖనిజ శాస్త్రం, పర్యవరణ భూగర్భశాస్త్రం వంటి విభిన్న కోర్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.


భట్టికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ అధికారులు

4న జమలాపురం రండి...

శ్రీవారి కల్యాణోత్సవానికి ఉప ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఈవో

ఎర్రుపాలెం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే శ్రీవారి కల్యాణానికి సతీసమేతంగా రావాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆలయ అధికారులు ఆహ్వానం అందించారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ మేరకు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు బుధవారం ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం దేవాలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా శ్రీవారి శేషవస్త్రాలను, ప్రసాదం అందించారు. అనంతరం దేవాదాయశాఖ కమిషనర్ ఈ.శ్రీధర్‌కు కూడా ఆహ్వాన పత్రికను అందించారు. ఏప్రిల్ 4న వకుళమాత ఆలయంలో నిర్వహించే శ్రీవారి కల్యాణానికి డిప్యూటీ సీఎం హాజరవుతారని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, వేదపండితుడు సాయి అభిలాష్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీపై మళ్లీ మేడమ్ కన్ను

- గతంలో పనిచేసిన సమయంలో పలు ఆరోపణలు
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య కేసులో నిందితురాలు
- కార్యాలయంలో ఇప్పటికీ ఆమెపై కొనసాగుతున్న విచారణ
- అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ రెండింటిలో ఏదో ఒక పోస్టు కోసం జోరుగా ప్రయత్నాలు



ఖమ్మం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కార్యాలయంలో గతంలో అసిస్టెంట్ కమిషనర్‌గా, డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి పలు ఆరోపణలకు గురైన ఓ మహిళా అధికారి మళ్లీ అదే కార్యాలయానికి రావడానికి జోరుగా ప్రయత్నాలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. తాను గతంలో పనిచేసిన రెండు స్థానాల్లో... ఒక పోస్టు కోసం అభ్యర్థన పెట్టుకొని అందులో సఫలీకృతమయ్యేలా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపీడీవోగా ఉన్న ఆమెను డిప్యూటేషన్‌పై కేఎంసీలో అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. మూడేళ్లపాటు పనిచేసిన తర్వాత ఆమెను స్వంత డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ పెద్ద అంబర్‌పేట నుంచి సత్యనారాయణను ఇక్కడికి బదిలీ చేశారు. అయితే అదే రోజు మునిసిపల్ జనరల్ ఫండ్ నుంచి జీతం ఇచ్చేలా ఆమెకు డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అప్పుడు ఈ పోస్టింగ్ పెద్దఎత్తున చర్చకు దారి తీసింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకు ఆమెను ఇక్కడి నుంచి బదిలీ చేయగా, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఒక శాఖకు జిల్లా అధికారి (ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్నారు. కేఎంసీలో ఆమె పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించే విషయంలో అవకతవకలకు పాల్పడ్డారన్న అంశంపై ఆమె ఇప్పటికీ విచారణను ఎదుర్కొంటున్నారు. ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కూడా ఆమెపై కేసు నమోదైంది. పలు ఆరోపణలపై ఇటీవల కాలంలో కార్పొరేషన్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు కూడా.

అలాగే కార్పొరేషన్ కార్యాలయంలో తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకుని ఇష్టారీతిన వ్యవహరించేవారని, ఓ పార్టీకి చెందిన వర్గం వారికే పనులు చేసేవారన్న విమర్శలు ఆమె ఎదుర్కొన్నారు. ఆమె హయాంలో మొక్కల కొనుగోళ్లలోనూ అక్రమాలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఒక్కో మొక్కను రూ.540కు కొనుగోలు చేయగా అవే మొక్కలను ప్రస్తుతం రూ.310కే కొనుగోలు చేయడం గమనార్హం. ఉద్యోగుల గ్రేడ్‌ల విషయంలోనూ అనర్హులను సైతం టెక్నికల్ ఉద్యోగులుగా చూపిస్తూ అప్‌గ్రేడ్ చేసిన అంశంపైనా పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఖమ్మం కార్పొరేషన్‌లోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు సెక్రటరియేట్ నుంచి ఫోన్ వచ్చింది. సదరు మహిళా అధికారి కేఎంసీకి రావడానికి అభ్యర్థన పెట్టుకున్నారని, డిప్యూటీ కమిషనర్‌గా కానీ, అసిస్టెంట్ కమిషనర్‌గా కాని పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారని వెల్లడించారు. దీంతో ఆమె ప్రయత్నం బయటికి పొక్కి కేఎంసీ వర్గాల్లో హాట్‌టాపిక్ మారింది. ఆమెపై వచ్చిన ఆరోపణలపై ప్రస్తుత అసిస్టెంట్ కమిషనర్ విచారణ అధికారిగా వ్యవహరిస్తుండగా, మళ్లీ అదే స్థానం లేదా అంతకంటే పై అధికారి స్థానం ఇవ్వాలని ఆమె అభ్యర్థన పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆరోపణలు, విచారణ ఎదుర్కొంటున్న కార్యాలయంలో ఆమెకు మళ్లీ ఎలా పోస్టింగ్ ఇస్తారనే ప్రశ్నను పలువురు లేవనెత్తుతున్నారు.

టీజీఈ జేఏసీ జిల్లా కమిటీ ఎన్నిక

చైర్మన్‌గా గుంటుపల్లి శ్రీనివాసరావు



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. టీఎన్జీవో భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. టీజీ జేఏసీ చైర్మన్‌గా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్‌గా టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, కో-చైర్మన్‌గా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ సెక్రటరీ పారుపల్లి నాగేశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరి సునీల్‌రెడ్డి పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం (మిగతా 6వ పేజీలో)

ఖజానాశాఖలో ముగ్గురికి
డిప్యుటేషన్ రద్దు
ఉత్తర్వులు జారీ చేసిన డైరెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖజానాశాఖలో ముగ్గురు ఉద్యోగులకు డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాష్ట్ర ఖజానాశాఖ డైరెక్టర్ కేఎస్ఆర్సీ మూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవీంద్రబాబు సీనియర్ అసిస్టెంట్ (వైరా), సంధ్యారాణి సీనియర్ అసిస్టెంట్ (మధిర), శోభారాణి జూనియర్ అసిస్టెంట్ (నేలకొండపల్లి) వీరంతా ఖమ్మం ఖజానాశాఖలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఖజానాశాఖలో ఉద్యోగుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూడా ఉద్యోగులను పిలిచి వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనూ మంగళవారం కూడా ఉద్యోగులు అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో ఖజానాశాఖ డీడీ ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు ముగ్గురి డిప్యుటేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆ ముగ్గురు వారి స్థానాల్లో చేరాలంటూ డీడీ సూచించినట్లు సమాచారం.

గోటి తలంబ్రాలను సమర్పించిన భక్తులు

భద్రాచలం మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారికి ఖమ్మంకు చెందిన శ్రీ లక్ష్మీ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళ బృందం గోటి తలంబ్రాలను సమర్పించారు. తొలుత వారు ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోటి తలంబ్రాలను సమర్పించారు.

‘మక్క’ల చిక్కులు

- కొనుగోలు కేంద్రాలు లేక అన్నదాతల అవస్థలు
- ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్న వైనం
- గిట్టుబాటు ధర దక్కట్లేదని ఆందోళన
- 15 రోజుల వ్యవధిలో చెల్లింపులు


కల్లాల్లో ఆరబోసిన మక్కలు

బోనకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మక్క సాగుతో అధిక దిగుబడులు సాధించడంలో జిల్లాలో అగ్రగామిగా ఉన్న బోనకల్ మండలం లో ఈ యాసంగి సీజన్‌లో కూడా రైతులు అత్యధికంగా మక్క సాగు చేశారు. పత్తి సాగు చేసి దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలు లేక అప్పుల పాలయ్యారు. నష్టాలను అధిగమించేందుకు పత్తి పంటను తొలగించి దాదాపు 17 వేల ఎకరాల్లో మక్క పంటను సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తక్కువ సారం గల భూముల్లో కూడా ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైతులు మిషన్ల ద్వారా కంకి పట్టించి కలాల్లో ఆరబోశారు. అమ్మకానికి సిద్ధమైనప్పటికీ మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రైవేటు వ్యాపారులకు విక్రయాలు

కల్లాలో ఎండిన మక్కలను రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం క్వింటా మక్కల ధర రూ.2200 ఉండగా.. ప్రస్తుతం రూ.2100లకు కొనుగోలు చేస్తున్నారు. రానురానూ ఇంకా తగ్గించే పరిస్థితులు లేకపోలేదని పలువురు వాపోతున్నారు. అమ్మిన పంటకు సంబందించి చెల్లింపులకు మాత్రం 15 రోజుల వ్యవధి పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. సొసైటీల ద్వారా మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ధరల స్థిరీకరణతోపాటు తగ్గుదల ఉండదని పలువురు భావిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు, ఎగుమతుల కొరకు రోజుల తరబడి రైతులు పడిగాపులు కాసేవారు. అలాంటి పరిస్థితులను పునరావృతం కాకుండా సకాలంలో కాంటాలు, ఎగుమతులు జరిపితే కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని రైతు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మరీదు గురుమూర్తి, రైతు, ఆళ్లపాడు



పండించిన మక్క పంటను కల్లాల్లో ఆరబోశా. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధర లభించేది. ప్రస్తుతం వ్యాపారులు క్వింటా మక్కలను రూ.2100లకు కొనుగోలు చేస్తున్నారు. మరో రెండు రోజుల వ్యవదిలో ఇంకా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తారని ప్రచారం జరుగుతోంది.

తక్కువకు అమ్మాను...

బంధం నాగేశ్వరరావు, రైతు, ముష్టికుంట్ల



కొనుగోలు కేంద్రాలు లేక తాను పండించిన 60 క్వింటాళ్ల మక్కలను రూ.2100ల చొప్పున ప్రైవేటు వ్యాపారులకు అమ్మాను. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలైతే రూ.2220 ధర ఉండేది. రాబోయే రోజుల్లో ఇంకా ధర తగ్గే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అలస్యమైతే ఎక్కువ మంది రైతులు వ్యాపారులకే అమ్మకాలను చేస్తారు.


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీఎం, మంత్రులు

గిరిజన మ్యూజియం బ్రోచర్లను
ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

భద్రాచలం మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గిరిజన మ్యూజియానికి సంబంధించిన బ్రోచర్లను బుధవారం హైదరాబాద్‌లోని శాసనసభ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఖండాంతరాలకు వ్యాపించడానికి భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన తెగలకు సంబంధించిన మ్యూజియం ఏర్పాటు చేయడంతో వారి సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. గిరిజన మ్యూజియం ఏర్పాటుతో భద్రాచలం ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణలు, మట్టా దయానంద్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఐటీడీఏ పీవో బి.రాహుల్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం రసాభాస

- వాటర్‌ట్యాంకు ఎక్కిన స్థానిక యువకులు
- వెనుదిరిగి వెళ్లిన పాలకమండలి సభ్యులు
- ప్రమాణస్వీకారం వాయిదా..

పాల్వంచ రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరొందిన పెద్దమ్మతల్లి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం బుధవారం రసాభాసగా మారింది. దేవాదాయశాఖ వెల్లడించిన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి సిద్ధం కాగా... రెండు గ్రామాల స్థానికులు వ్యతిరేకిస్తూ అడ్డుపడ్డారు. దీంతో అద్యంతం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎటూతేల్చని అధికారులు ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేశారు.

ఈనెల 6న భట్టి వర్గీయులు పాలకమండలి ఉత్తర్వులను పొందారు. ప్రమాణస్వీకారం కోసం ఏర్పాటుచేస్తుండగా పొంగులేటి వర్గీయులు వారి ఉత్తర్వులను రద్దు చేయించారు. తమ పట్టును నిలబెట్టుకుని నూతనంగా ఈనెల 19న పాలకమండలి ఉత్తర్వులను తెచ్చుకున్నారు. అయితే వీరి ప్రమాణస్వీకారానికి ఎవరూ అడ్డుపడకుండా వ్యూహాత్మకంగా ప్రమాణస్వీకారానికి సిద్ధమై వచ్చారు. పాలకమండలిలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని రెండు గ్రామాల ప్రజలు అధికారులకు తెలియజేస్తూ మొదటినుంచి నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు తమ వాదనను వినిపించారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం కోసం ఆలయానికి చేరుకోగానే మూకుమ్మడిగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దేవస్థానం ఈవో కార్యాలయంలోకి వారిని వెళ్లకుండా అడ్డుపడ్డారు. ఈవో రజనికుమారిని సైతం కార్యాలయంలో నుంచి బయటకు రాకుండా నిరసన తెలిపారు. పాలకమండలిలో కేశవాపురం-జగన్నాథపురం స్థానికులైన ఇద్దరికి చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాణస్వీకారం చేయించేందుకు వచ్చిన దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ బేల్‌సింగ్‌ను సైతం నిలదీశారు. క్రిమినల్ కేసులు ఉన్నవారికి ఏవిధంగా స్థానం కల్పిస్తారని ప్రశ్నించారు.

వాటర్‌ట్యాంకు ఎక్కిన యువకులు..

పాలకమండలి సభ్యులకు, స్థానికుల మధ్య వివాదం జరుగుతుండగా ఇద్దరు యువకులు దేవస్థానం ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కారు. పాలకమండలిలో కేశవాపురం-జగన్నాధపురం గ్రామస్థులకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈవో రజనికుమారి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ, ఎస్ఐలు దేవస్థానం వద్దకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. వాటర్ ట్యాంకు ఎక్కిన యువకులతో ఫోన్‌లో సంప్రదించి హామీ ఇచ్చారు.


అర్ధనగ్నంగా నిరసన, వాటర్‌ట్యాంకు ఎక్కిన స్థానికులు (ఇన్‌సెట్‌లో)

యువకులు వాటర్‌ట్యాంకు దిగడంతో ఊపిరిపీల్చుకున్నారు.

వెనుదిరిగి వెళ్లిన పాలకమండలి సభ్యులు..

పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద ప్రమాణస్వీకారోత్సవం కోసం వచ్చిన పాలకమండలికి నిరసన సెగ ఎదురైంది. స్థానికులకు అవకాశం కల్పిస్తేనే ప్రమాణస్వీకారం జరుగుతుందని భీష్మించుకుని కూర్చొన్నారు. ఈవో రజనికుమారి ఇరువర్గాలతో మాట్లాడి రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. తప్పని పరిస్థితుల్లో పాలకమండలి సభ్యులు వెనుదిరిగి వెళ్లారు. ప్రస్తుతానికి ప్రమాణ స్వీకారోత్సవం వాయిదా వేస్తున్నట్లు ఈవో రజినికుమారి తెలిపారు.


ఆస్పత్రిలో కాయకల్ప బృందం

సీహెచ్‌సీని సందర్శించిన కాయకల్ప బృందం

సత్తుపల్లిరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం కాయకల్ప బృందం సభ్యులు పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రతిఏటా అందించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వార్డు, వైద్యుల వివరాలు, క్యాజువాలిటీ, సీమాంగ్ సెంటర్, ఆపరేషన్ థియేటర్, మందులు, స్టాక్ వివరాలను పరిశీలించి పలు వివరాలు సేకరించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన బృందం సభ్యులు రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా సీమాంగ్ సెంటర్‌లో లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవల వివరాలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని మెడికల్ వేస్టేజీ, పారిశుధ్య నిర్వహణ, ఆస్పత్రి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను, తదితర అంశాలను సేకరించి నమోదు చేసుకున్నారు. వైద్యుల బృందంసభ్యులు నాగేంద్రమ్మ, పర్హానా, ఆజ్మీర, రజనిలతోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన భద్రాద్రి

(5వ పేజీ తరువాయి)

లంబాడీ కాలనీకి చెందిన కామేష్‌గా భావిస్తున్నారు. మేస్త్రీలకు సహాయకంగా పని చేసేందుకు వచ్చిన వలస కూలీలు కూడా శకలాల్లో ఉన్నారని అనుమానిస్తున్నారు. భవనం కూలే సమయంలో మొత్తం ఆరుగురు ఉన్నారని మరికొందరు చెబుతున్నారు. అయితే ఆరు అంతస్తుల శిథిలాలు ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం వల్ల కింది భాగంలో ఎవరు చిక్కుకుపోయారనేది తెలుసుకోవడం కష్టసాధ్యంగా మారింది.

సంఘటన సమాచారం తెలిసిన వెంటనే భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఆర్డీవో దామోదర్‌రావు, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శిథిలాలను తొలగించి అందులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సింగరేణి రెస్క్యూ బృందాన్ని రప్పించారు. రెస్క్యూ బృందం రంగంలోకి దిగగా బుధవారం రాత్రి సైతం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు ఇతర అధికార యంత్రాంగంతో కలిసి రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

లొంగిపోయిన శ్రీపతి దంపతులు?



బహుళ అంతస్థుల భవనం కుప్పకూలిన వెంటనే నిర్మాణదారులైన శ్రీపతి, శ్రీనివాసం శ్రీరామ స్వాతి దంపతులు భద్రాచలం పట్టణ పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. పోతులవారి వీధిలో శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టుకు చెందిన శ్రీవిజయ కనకదుర్గ భవానీ దేవస్థానంలో కీలకంగా వ్యవహరిస్తున్న వీరు ఘటన జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది.

నిర్మాణంలోనే లోపాలు..

భద్రాచలంలో జీ+5 బహుళ అంతస్తుల భవనం కూలిన ఘటనలో ఎన్నో లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. భద్రాచలంలో శ్రీపతి అనే వ్యక్తి కుటుంబానికి 500గజాల్లో పాత భవనం ఉంది. 35 ఏళ్ల క్రితం దీనిని నిర్మించారు. శ్రీపతి నేషనల్ సేవా ట్రస్టును నెలకొల్పి పాత భవనంపైన ఆరు అంతస్తుల నిర్మాణానికి 2021లో శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ట్రస్టు పేరిట డొనేషన్లు సైతం వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు, భక్తులకు వసతి కల్పించేందుకు అనువుగా ఈ భవన నిర్మాణాన్ని డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా శ్రీపతి భవన నిర్మాణం చేపట్టి పనులు కొనసాగిస్తున్నా.. పంచాయతీ వారు అడ్డుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పాతభవనం మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించినందున దాని సామర్థ్యం జీ+1కు మాత్రమే సరిపోతుందని ఇంజనీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాని సామర్థ్యానికి మించి జీ+5 నిర్మాణం చేపట్టడంతో కూలినట్లు అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా పిల్లర్ల నిర్మాణంలో కనీసం 20ఎం.ఎం. రాడ్లు సైతం ఉపయోగించాల్సి ఉండగా, 12ఎంఎం రాడ్లను మాత్రమే వినియోగించినట్టు తె లుస్తోంది. అలాగే పిల్లర్ మందం కనీసం రెండు అడుగులపైన ఉండాల్సి ఉండగా ఒక అడుగు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో జీ+5 నిర్మాణంతో పిల్లర్ల లోపలి పటుత్వం క్రమ క్రమంగా తగ్గి ఒక్కసారిగా కూలిపోయినట్లు అంచనా వేస్తున్నారు. కాగా మేస్త్రీలు బుధవారం గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లర్లకు అదనపు బలాన్ని ఇచ్చేందుకు చేపట్టిన చర్యలు వికటించి ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

పట్టించుకోని అధికారులు

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం. ఇక్కడ రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ అమల్లో ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టడం పూర్తిగా చట్ట వ్యతిరేకం. ముఖ్యంగా పట్టా భూమి లేని గిరిజనేతరులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం లేదని చట్టం చెబుతోందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఇక్కడ తొలి నుంచి నిబంధనలు ఉల్లంఘించి జీ+5 భవన నిర్మాణం చేపడుతున్నా.. అధికారులు ఏం చేస్తున్నారని గిరిజన సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి నివాస యోగ్యానికి మాత్రమే ఇంటిని నిర్మించుకోవాల్సి ఉన్నా.. ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రమాద ఘటన చోటు చేసుకుంది. ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం అధికారుల పర్యవేక్షణ తీరుకు అద్దం పడుతోందని గిరిజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

జిల్లా, డివిజన్, ఏజెన్సీ అధికారులు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతుంటే సంబంధిత పంచాయతీ అధికారులు భవన పనులు పూర్తిస్థాయిలో నిలిపివేయకుండా ఎందుకు చర్యలు చేపట్టలేదని వారు నిలదీస్తున్నారు. ఫలితంగా ఈ భవనం నిర్మాణ సమయంలోనే కుప్పకూలడం జరిగిందని వారు పేర్కొంటున్నారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు చేపట్టని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు, సీపీఎం, బీఆర్ఎస్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, మాస్‌లైన్‌కు చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఇంటి పిల్లర్లపై ఐదు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపడుతున్నారని దానిని తక్షణమే నిలిపివేయాలని ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేయగా.. ఆయన సత్వరమే చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ అధికారిని ఆదేశించినా.. చర్యలు లేవన్నారు.

మంత్రి తుమ్మల, పొదెం, తెల్లం దిగ్భ్రాంతి

భద్రాచలంలో ఐదంస్తుల భవనం కుప్పకూలిన విషయం తెలిసిన వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ శిథిలాలను వెంటనే తొలగించాలని, రెస్క్యూ బృందంతో శిథిలాల్లో ఉన్న వారిని కాపాడాలని అధికారులకు సూచించారు.



శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం


రోదిస్తున్న మేస్త్రీ ఉపేందర్ రావు భార్య


సహాయక చర్యలు చేపడుతున్న సింగరేణి రెస్క్యూ టీం

ఇందిరమ్మ ఇళ్లకు లక్ష రుణం

మహిళా సంఘాల ద్వారా అందించేందుకు చర్యలు... కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముందు డబ్బులు పెట్టుకోలేని నిరుపేదలకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని నిర్ణయించినట్టు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. వివిధ మండలాల్లో పైలట్ గ్రామాలలో మంజూరు చేసిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. పైలట్ గ్రామాల్లో ఎంపిక చేసిన 850 లబ్ధిదారుల్లో ఇంటి నిర్మాణానికి ముందు డబ్బులు పెట్టుకోలేని 369 మంది నిరుపేదలు ఉంటే మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో వీరందరికీ రుణాలు అందించేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న మోడల్ హౌస్ నిర్మాణం పనుల వద్ద లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి తక్కువ ఖర్చుతో మంచి ఇంటిని ఎలా నిర్మించుకోవాలో అవగాహన కల్పించాలన్నా రు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణం ముందు సంపూర్ణ అవగాహన అందేలా చూడాలని అన్నారు. జిల్లాలో మంజూరైన 850 ఇందిరమ్మ ఇండ్ల పనులు గ్రౌండ్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, వారం రోజుల్లో వీరంతా తప్పనిసరిగా మార్క్ ఔట్ జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఎల్1, ఎల్2 విభాగాల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పూర్తి వివరాలను అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్ష రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి స న్యాసయ్య, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపులకు మంచి తరుణం

- వడ్డీలపై 90శాతం మాఫీ
- మొండి బకాయిలపై కేఎంసీ దృష్టి
- 84 శాఖల నుంచి రూ.6 కోట్లు బకాయిలు
- కమర్షియల్, నివాసాల నుంచి మరో రూ.5 కోట్ల వసూళ్లు లక్ష్యం

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆదాయ ట్యాక్స్ చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను ప్రకటించింది. కరోనా సమయం నుంచి వేలాది మంది వ్యాపార, నివాసదారులు ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు చెల్లించలేదు. దీంతో గత మూడేళ్ల కాలంలో ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటుగా వడ్డీలు భారంగా మారాయి.

ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపుదారులకు మంచి అవకాశం కల్పించింది ఈనెల 27నుంచి 31 వరకు ప్రాపర్టీ చెల్లించిన వారికి వడ్డీలో 90శాతం మాఫీని ప్రకటించింది.

ప్రభుత్వ కార్యాలయాలకు ఆర్థిక వెసులబాటు

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 85 ప్రభుత్వ, అనుబంధ కార్యాలయాల ద్వారా కేఎంసీకి ప్రాపర్టీ ట్యాక్స్‌లు బకాయిలు పడ్డారు. సుమారు రూ.6 కోట్లు వరకు ట్యాక్స్ వసూళ్లు కావాల్సి ఉంది. అయితే ఇటీవల కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కలెక్టర్ ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు పంపారు. దీంతో విద్యుత్‌శాఖ నుంచి రూ.60 లక్షలు, వ్యవసాయ మార్కెట్‌శాఖ నుంచి రూ.40.57 లక్షలు, పోలీసుశాఖ నుంచి రూ.6 లక్షల వసూళ్లు జరిగాయి.

మొండి బకాయిలపై కేఎంసీ దృష్టి

ఖమ్మం నగర పాలక సంస్థ ఈ ఏడాది ఆదాయ వసూళ్ల రూ.32 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో రూ.27 కోట్ల ఆదాయం రాబట్టారు. అయితే ప్రభుత్వం వడ్డీ మాఫీ విధానం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు ఆర్థిక వెసులబాటు కానుంది. బీఎస్ఎన్ఎల్ నుంచి కేఎంసీకి రూ.1.90 కోట్లు బకాయిలు ఉన్నాయి. వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకుంటే రూ.90లక్షల వరకు మాఫీ అమలు కానుంది. అలాగే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూ.1.60 కోట్ల బకాయిలు ఉన్నాయి. వడ్డీ మాఫీ పొందితే రూ.70లక్షల వరకు తగ్గే అవకాశం ఉంది. ఇలా మొండి బకాయిలపై కేఎంసీ కమిషనర్ దృష్టి సారించారు. ఏ ప్రభుత్వ కార్యాలయం ఎంత ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు ఉన్నారు. వడ్డీ మాఫీ ద్వారా ఎంత ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది అనే విషయాలను వివరిస్తూ మరోసారి నోటీసులు పంపుతున్నారు. ఇలా ప్రభుత్వ కార్యాలయాల నుంచి మరో రూ.5 కోట్లు రాబట్టేందుకు చర్యలను ప్రారంభించారు.

నివాసాల నుంచి మరో రూ.5 కోట్లు

ఖమ్మం నగర పాలక సంస్థలో ఇప్పటికే 48వేల నివాసాల నుంచి రూ.26 కోట్లు వసూళ్లు చేశారు. ఇంకా 32 వేల నివాసాల నుంచి మరో రూ.5 కోట్లు ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లు జరగాల్సి ఉంది. 1,200 కమర్షియల్, నివాసాలకు రెడ్ నోటీసులు జారీ చేశారు. వీరిలో 360 మంది చెల్లింపులు చేశారు. ఇంకా కేవలం వారం రోజులు మాత్రమే వడ్డీ మాఫీకి గడువు ఉంది. గడువులో మూడు రోజులు వరస సెలవ్‌లు ఉన్నాయి. రంజాన్, ఆదివారం, ఉగాది కారణంగా ఈ లోపుగానే రాబోయే మూడు రోజుల్లోనే ఆదాయ వసూళ్ల లక్ష్యం పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ లక్ష్యాలను అప్పగించారు.

మంత్రుల శాఖల్లో
మార్పులు!?

(5వ పేజీ తరువాయి)

శాఖల బాధ్యతలు నిర్వహించడం ఉండేదికాదు. ప్రస్తుతం మంత్రులకు శాఖలు భారంగానే ఉన్నప్పటికీ ముగ్గురు మంత్రులు తమదైన ముద్రచూపుతూ కేబినేట్‌లో కొనసాగుతున్నారు. అయితే కొత్త మంత్రులు వస్తే ప్రస్తుతం ఉన్న మంత్రుల వద్ద అదనంగా ఉన్న శాఖలు కొన్ని మార్పులు జరుగుతాయని, విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరి వద్ద ఏ శాఖ ఉంటుంది.. అన్నదానిపై రాజకీయవర్గాల్లో రెండురోజులుగా చర్చలు సాగుతున్నాయి. జిల్లాలో ముగ్గురు మంత్రులు కీలక శాఖలే నిర్వహిస్తున్నారు. ఒక్కో మంత్రి వద్ద మూడుశాఖలు ఉన్నాయి. ఇందులో కొన్ని శాఖలు వేరే మంత్రులకు వెళ్తాయని ప్రచారం సాగుతోంది. మంత్రుల శాఖల్లో మార్పులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ అధిష్టానం బలంగా భావిస్తే మార్పులు ఉండే అవకాశం ఉంది.

టీజీఈ జేఏసీ జిల్లా కమిటీ ఎన్నిక

(5వ పేజీ తరువాయి)

అధ్యక్షుడు మామునూరి రాజేష్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, ఎంపీవోస్ అసోసియేషన్ మల్లెల రవీంద్ర ప్రసాద్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం శశిధర్, చర్ల శ్రీనివాస్, పెన్షనర్స్ సంఘం ఎం.సుబ్బయ్య, పి.పుల్లయ్య, డాక్టర్స్ అసోసియేషన్ డాక్టర్ బాబు రత్నాకర్, డాక్టర్ సైదులు తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఏప్రిల్ ఒకటి నుంచి జిల్లా స్థాయిలో జరిగే కార్యాచరణ అమలుకు ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.



బినామీలను మార్కెట్‌లో అడుగుపెట్టనివ్వం

యరగర్ల హన్మంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ , ఖమ్మం

ప్రశ్న: మిర్చి రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఖమ్మం మార్కెట్ కమిటీ నుంచి రూ.5 కోట్లు 6 నెలల వరకు వడ్డీ లేని రైతుబంధు రుణాలు ఇస్తున్నాం. ఇప్పటి వరకు ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. రెండు లక్షల చొప్పున 10లక్షలు పంపిణీ చేశాం. మరో 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి కూడా త్వరలోనే అందిస్తాం

ప్ర: యార్డుల పరిశుభ్రతను ఎలా ఉంది?

జ: యార్డులను ఏ రోజుకు ఆరోజే పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: రైతులకు నీటి సదుపాయం కల్పించారా?

జ: వేసవినిదృష్టిలో ఉంచుకొని యార్డుల్లో మొత్తం ఐదు చోట్ల తాగు నీరందించేందుకు ప్యూరి ఫైడ్ డ్రింకింగ్ ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేశాం. నీటిని సప్లై అందించే ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: బినామీ వ్యాపారులపై చర్యలుంటాయా?

జ: మార్కెట్‌లో లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్ తప్ప బినామీ కమీషన్ ఏజెంట్లు ఎవరైనా కనబడితే వారిపై వెంటనే చర్యలు తీసుకుంటాం. మార్కెట్లోకి వారిని అడుగు పెట్టనియ్యం.

ప్ర: దొంగల బారినపడే రైతులకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

జ: రైతులు పంట అమ్మిన తరువాత తమ నగదును తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎవరైనా అపరిచితులు తమను ఫాలో అవుతున్నారంటే వెంటనే వారి కమీషన్ ఏజెంట్లకు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.

ప్ర: రాబోయే రోజుల్లో మార్కెట్‌ను ఎలా అభివృద్ధి చేయాలని చూస్తున్నారు?

జ: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తయారు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయి. దేశంలోనే ఇతర మార్కెట్లకు ఆదర్శంగా మార్కెట్‌ను తీర్చి దిద్దేందుకు మంత్రి తుమ్మల నడుం బిగించారు.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

ఉద్యాన శాఖకు 'పొరుగు' కళ

- సేవలందించనున్న పొరుగు సేవల విస్తరణాధికారులు
- ఉమ్మడి జిల్లాలో 13మంది పునర్ నియామకం
- మంత్రి తుమ్మల చొరవతో తీరనున్న ఇబ్బందులు



అశ్వారావుపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ఈస్థాయిలో పంటల సాగుకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చేందుకు సరిపడా సిబ్బంది అవసరమే. క్షేత్రస్థాయిలో ఉద్యాన పంటలు సాగుచేసే అన్నదాతల కోసం ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యానవనశాఖలో పొరుగు సేవల ద్వారా విస్తరణాధికారులను(హెచ్‌ఈవో) నియమించారు. 2008లో అప్పటి ప్రభుత్వం మండలాల్లో పంటలు సాగవుతున్న విస్తీర్ణాన్ని బట్టి హెచ్‌ఈవోలను నియమించారు. పంటలు అధికంగా ఉండే మండలంలో ఒకరిని, పంటలు తక్కువగా ఉండే రెండు మూడు మండలాలకు ఒక్కో విస్తరణాధికారుల చొప్పున నియమించారు. అన్నదాతలకు, ఉద్యానశాఖకు మధ్య వారధులుగా ఉంటూ విస్తరణాధికారులు తమ విధులను నిర్వహించేవారు. అయితే 2020లో గత ప్రభుత్వ కాలంలో పథకానికి నిధులు లేవంటూ విస్తరణాధికారులను విధులను నుంచి తొలిగించారు. 2020 ఏప్రిల్ 30న ప్రభుత్వం వీరిని బాధ్యతల నుంచి తొలిగిస్తున్నట్లు ప్రకటించింది.

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తరుణంలో పలుమార్లు వ్యవసాయశాఖ మంత్రిని తుమ్మలను కూడా కలిసి తమను విధుల్లోకి తీసుకోవాలని బాధితులు కోరారు. ఈనేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అర్హుల జాబితా తయారు చేసి పంపాలని ఉద్యానశాఖ అధికారులను సూచించారు. దీంతో తిరిగి నియామకాలను అనుమతిని ఇస్తూ ఈనెల 22న ప్రభుత్వం మెమో జారీ చేసింది. ఈనేపథ్యంలో ఈనెల 24న హైదరాబాదులోని ఉద్యానవనశాఖ శిక్షణా భవనం వద్ద గతంలో పనిచేసిన విస్తరణాధికారులు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఉన్నధికారులు ఆదేశించటంతో గతంలో పనిచేసిన హెచ్‌ఈవోలు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వీరి నుంచి అన్ని వివరాలను సేకరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో 13మంది వరకు పనిచేయగా 12మంది వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు వెళ్లినట్లుగా సమాచారం.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, నిరుద్యోగ యువత ఏప్రిల్ 5లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి బుధవారం తెలిపారు. ఏప్రిల్ 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించిందని తెలిపారు. రూ. 50వేలలోపు యూనిట్లకు నూరు శాతం సబ్సిడీ , రూ.లక్ష వరకు 90శాతం సబ్సిడీ, రూ. లక్ష రూ.2లక్షల విలువైన యూనిట్లకు 80వాతం సబ్సిడీ, 20 శాతం రుణం అందించనున్నారు. రూ. 2లక్షల నుంచి రూ.4లక్షల విలువైన యూనిట్లకు 70 శాతం సబ్సిడీతోపాటు 30 శాతం బ్యాంక్ రుణం మంజూరుచేస్తారు. అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాల వరైతే రూ. 1.50 లక్షల, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లోల లోపు ఆదాయం ఉన్నవారు అర్హులని తెలిపారు. 21 నుంచి 55 సంవత్సరాల లోపు వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సంభందిత పథకాలకు పట్టాదారు పాస్‌బుక్, 21 నుంచి 60 ఏళ్ల వరకు అర్హులని తెలిపారు. రేషన్‌కార్డు లేనివారు ఆదాయ పత్రం జత చేయాలని తెలిపారు.

కమిటీ చైర్మన్‌గా కలెక్టర్

రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగ యువతకు అందించే యూనిట్ల పరిశీలనకు ప్రభుత్వం మండల, జిల్లా స్థాయి కమిటీలను నియమించింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మెన్‌గా , కన్వీనర్‌గా డీఆర్‌డీవో, సభ్యులుగా అదనపు కలెక్టర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏఈ, గిరిజన సంక్షేమ శాక డీటీడీవో, లీడ్ బ్యాంక్ మేనేజర్‌సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో పరిశీలన పూర్తిచేసిన అనంతరం జిల్లా స్థాయి కమిటీలో అర్హుల జాబితాను ప్రకటిస్తారు.

ఆడపిల్ల పుట్టింది.. స్వీట్ బాక్స్ అందింది

'మా ఇంటి మణిదీపం ' పేరిట కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేపట్టిన వినూత్న కార్యక్రమం బుధవారం అధికారికంగా ప్రారంభం అయింది. ఆడపిల్ల పుట్టిన ఇంటికి స్వీట్ బాక్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలపాలని కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈమేరకు వివిధ శాఖల అధికారులు ఆడపిల్లల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి స్వీట్ బాక్సులు అందజేశారు.

ఖమ్మం రూరల్/ కూసుమంచి/ కామేపల్లి/ తిరుమలాయపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి.. అని ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ అన్నారు. బుధవారం కామేపల్లి మండల పరిధిలోని జాస్తిపల్లి గ్రామంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ దంపతులను, ఇంటి పెద్దలను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం, మిఠాయిలును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆడ పిల్లలే ఆ ఇంటికి మహాలక్ష్మి అని, వారిని చదివించి ధైర్యాన్ని నింపాలని సూచించారు. ఉన్నత స్థాయికి చేరేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మధుసుదన్, సీడీపీవో దయామణి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం రమ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

● ఆడపిల్ల పుట్టడం మన ఇంటి అదృష్టంగా భావించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్యోతి అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమళ్ల గ్రామంలో కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన పేరంపల్లి దివ్య, ఉదయ్‌కిరణ్ దంపతులకు మొదటి సారి ఆడ పిల్ల పుట్టింది.



ఆడపిల్లను కన్న దంపతులకు సన్మానం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

ఈ విషయం తెలుసుకున్న అధికారులు బుధవారం 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా వారి ఇంటికి వెళ్లి పుట్టిన పాపకు కొత్త దుస్తులతో పాటు స్వీట్లు అందించారు. దివ్య-ఉదయ్‌కిరణ్ దంపతులను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు.

● కూసుమంచి మండలం పాలేరులో తంగెళ్ల లక్ష్మీనర్సు- లక్ష్మి దంపతులకు ఆడపిల్ల జన్మించింది. దీంతో సివిల్ సప్లయీస్ డీఎం శ్రీలత, సీడీపీవో కవిత, తహసీల్దార్ కరుణశ్రీ తదితరులు లక్ష్మి ఇంటికి వెళ్లి స్వీట్ బాక్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అమ్మాయి పుట్టడం శుభసూచకమని ప్రచారం కల్పించేందుకు ఈకార్యక్రమాన్ని చేపట్టినట్లు డీఎం శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు

● తిరుమలాయపాలెం మండలంలోని కేశ్వాపురంలో మాఇంటి మణిదీపం కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన పోతుల సరిత, అనిల్ దంపతులకు ఇటీవల ఆడపిల్లకు జన్మ నిచ్చారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేపట్టిన మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా జేడీఏ పుల్లయ్య ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏవో సీతారాంరెడ్డి, ఐసీడీఎస్ అధికారులు ఆడపిల్ల పుట్టిన వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించి స్వీట్లు బాక్సు అందించారు. ఈసందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ఆడపిల్లపుట్టినట్లయితే లక్ష్మీదేవత ఇంటికివచ్చినట్లు భావించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీసీఎస్ ఏసీడీపీవో ఉదయశ్రీ, సూపర్‌వైజర్ సావిత్రి, కార్యదర్శి జాని, పాల్గొన్నారు.

నేడు అంతరిక్ష నమూనా ప్రదర్శన

కొత్తగూడెం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతరిక్ష నమూనా ప్రదర్శనను నిర్వహించనున్నట్లు కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ వ్యవస్థాపకుడు ఇండియన్ నరేష్ బుధవారం తెలిపారు. యువతరంలో స్ఫూర్తి నింపడంతో పాటు వారిని సైన్స్ వైపు ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అంతరిక్ష, రక్షణ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలు, కళాశాలల సైన్స్ ఉపాధ్యాయులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి ఎస్. చలపతిరావు కోరారు.

ఇన్సులిన్ ఇంజక్షన్లు వచ్చేశాయ్..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జిల్లా ఆస్పత్రికి చేరుకున్న స్టాకు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇన్సులిన్ ఇంజక్షన్లు జిల్లాకు చేరుకున్నాయి. రెండు నెలలకు సరిపడా 3వేల ఇంజక్షన్లు జిల్లాకు చేరుకున్నట్లు సమాచారం. జిల్లాలో ఇన్సులిన్ ఇంజక్షన్ల కొరతపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ఇన్సులిన్ ఇంజక్షన్ల కొరత అంటూ వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు సెంట్రల్ మెడికల్ స్టోర్‌కు సమాచారాన్ని పంపించడంతో 3వేల ఇంజక్షన్లను జిల్లాకు పంపిణీ చేశారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి జిల్లా జనరల్ ఆస్పత్రికి వెయ్యి ఇంజక్షన్లను తక్షణమే సరఫరా చేశారు. వీటితో రెండు నెలల వరకు స్టాకు సరిపోతుందని, మళ్లీ ఇండెంట్ పంపించనున్నట్లు సెంట్రల్ డ్రగ్‌స్టోర్ ఇన్‌చార్జ్ పద్మ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలు

ఖమ్మం లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరంలోని శ్రీసిటీ బారుగూడెం గ్రామానికి చెందిన అల్లం దుర్గశ్రీకి మూడు నెలలు జైలుశిక్షతో పాటు రూ.6లక్షలు ఫిర్యాదికి నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయధికారి కాసరగడ్డ దీప బుధవారం తీర్పుచెప్పారు. ఖమ్మం నగరం నెహ్రూనగర్‌కు చెందిన నల్లపాటి వెంకటేశ్వరరావు వద్ద దుర్గశ్రీ తన కుటుంబ అవసరాల నిమిత్తం 2016లో రూ.మూడు లక్షలను అప్పుగా తీసుకుంది. అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చింది. తరువాత వెంకటేశ్వరరావు తన రుణం తిరిగి ఇవ్వమని ఒత్తిడిచేయగా 2019లో రూ.5లక్షలకు చెక్కును జారీచేశారు. అట్టిచెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితురాలి ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. బ్యాంకు వారు ఫిర్యాదికి మెమో ఇవ్వడంతో, వెంకటేశ్వరరావు తన న్యాయవాది అనం చిన్నిరామారావు ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

మరో కేసులో...

ఖమ్మం లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో కొణిజర్ల మండలానికి చెందిన నిందితుడైన ధారావత్ రవికి మూడు నెలలు జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.రెండు లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం ఒకటవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కం రజని బుధవారం తీర్పుచెప్పారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామానికి చెందిన ఫిర్యాది బాణోతు లాల్‌సింగ్ వద్ద 2013లో రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకొని, అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చినాడు. ఫిర్యాది తన రుణం తిరిగి ఇవ్వమని ఒత్తిడిచేయగా 2014లో రూ.2లక్షల చెక్కును జారీచేశాడు. అట్టిచెక్కును ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో జమచేయగా నిందితురాలి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాదు తన న్యాయవాది అనం చిన్నిరామారావు ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి 6 నెలలు..

ఖమ్మం లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ముదిగొండ మండలం అదే గ్రామానికి చెందిన ఇరుకు రమేష్ అనే వ్యక్తికి 6నెలలు జైలుశిక్షతో పాటు రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పుచెప్పారు. కేసు వివరాల ప్రకారం.. 1జనవరి 2017 నాడు ముదిగొండ పోలీస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.సుందరమ్ విధులలో భాగంగా సాయంత్రం పెట్రోలింగ్ చేస్తూ బ్రహ్మం హోటల్ సమీపంలోకి రాగా, అదే సమయంలో అక్కడ కొందరు వ్యక్తులు గుంపులుగా చేరి కేకలు వేస్తున్నారు. వారిని అక్కడ నుంచి వెళ్లిపొమ్మనగా అందులోని ఇరుకు రమేష్ నీ డ్యూటీ నీవు చేసుకోమని అతడి చెంపపై కొట్టాడు. ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో తెలుపగా మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి రాగా వారిపట్ల కూడా ఇదేవిధంగా ప్రవర్తించడంతో పలువురిపై ముదిగొండ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

రైతుకు కొత్త ట్రాక్టర్ స్ప్రేయర్ ఇవ్వాలి

ఖమ్మం లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామనికి చెందిన రైతు మువ్వా కృష్ణార్జునరావు 2014లో నాడు ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్ 500 లీటర్ల ట్యాంకును పీస్‌బ్రాండ్‌ను రూ.70వేలకు ప్రతివాది అయిన సిగ్నటరీ ఎస్‌ఎన్‌కే కంపెనీ డీలర్ తిలక్‌నగర్ కల్వకుర్తి గ్రామం, మండలం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారి వద్ద కొనుగోలు చేశారు. ఫిర్యాది దీనిని కొన్న దగ్గర నుంచి సరిగ్గా పనిచేయకపోవడంతో కంపెనీని సంప్రదించాడు. వారు దానిని మరమ్మతులు చేయగా మరలా అది పనిచేయకపోవడంతో తన న్యాయవాది అయిన మువ్వా నాగేశ్వరరావు, తెల్లాకుల రమేష్‌బాబుల ద్వారా ఖమ్మం వినియోగదారుల ఫోరమ్‌లో కేసును ఫైల్ చేశాడు. ఇరుపక్షాల వాదనలు విన్న ఫోరమ్ మెంబర్లు వి.మాధవీలత, వి.లలితలు రైతుకు కొత్త ట్రాక్టర్ స్ప్రేయర్ ఇవ్వాలని, లేని పక్షంలో దాని ఖరీదు రూ.70వేలకు 7శాతం వడ్డీతో చెల్లించాలని, ఖర్చుల కింద రూ.10వేలు, నష్టపరిహారం కింద రూ.10వేలు ఇవ్వాలని తీర్పుచెప్పారు.

ఉన్నతస్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా పని చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కొణిజర్ల, మార్చి26(ఆంధ్రజ్యోతి): బాలికలంతా పట్టుదలతో కష్టపడాలని, ఉన్నతస్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో గల గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళల పట్ల చిన్నచూపు ఉన్న దశలో ఎలాంటి చర్చలేకుండానే ఓటుహక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం కోసం ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. చదువులో బాలుర కంటే బాలికలు అధికంగా రాణిస్తున్నారని అన్నారు. ఆడపిల్ల పుడితే గర్వకారణం అని చాటి చెప్పేందుకు జిల్లాలో గర్ల్‌ప్రైడ్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఆడపిల్ల పుట్టిన జిల్లా అధికారి స్వీట్‌బాక్స్‌తో



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వెళ్లి ఆ కుటుంబానికి అందజేసి శుభాకాంక్షలు తెలపడం జరుగుతుందన్నారు. గురుకులంలో ఉన్న బాలికలంతా చదువులో రాణించాలన్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకొని నలుగురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. మహిళలు రాణించాలని కోరుతూ తన భార్య కూడా యూపీఎస్సీ రాసి ఢిల్లీలో ఉన్నత బాధ్యతలో ఉన్నారని కలెక్టర్ గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో మహిళలు చిత్త శుద్ధితో కీలకంగా పని చేశారని తెలిపారు. తాను 7వ తరగతి చదువుకునే సమయంలో విజయలక్ష్మి టీచర్ బోధన వలనే తాను నేడు కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. పాఠాలు చెప్పి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషి చేసిన గురువులను మరిచిపోవడద్దని తెలిపారు. అనంతరం జిల్లా ఉపాధి అధికారి మాధవి మాట్లడుతూ మా పాప మా ఇంటి మణిదీపం అనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. చదువు మాత్రమే మనల్ని కాపాడుతుందని, ఈ విషయం ప్రతి మహిళ గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రజిత, ఆయా ఉపాధి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రఘు

కల్లూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ దొంగను కల్లూరులో అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ రఘు తెలిపారు. కల్లూరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బుధవారం కల్లూరులోని ప్రధాన సెంటర్‌లో ఉదయం 11 గంటలకు సమాచారం మేరకు చైన్స్ స్నాచర్ మూడు రమేష్‌ను సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, కల్లూరు ఎస్ఐ హరితలు అదుపులో తీసుకున్నారని తెలిపారు. చైన్‌స్నాచర్ మూడు రమేష్ ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన వాడని తెలిపారు. గత సంత్సరం జూన్ 5 కప్పలబంధం రోడ్డులో నివాసం ఉన్న కన్యాదానం నరిసింహాచార్యులుకు చెందిన చైన్‌ను దొంగలించాడని తెలిపారు. ఆ చైన్‌ను రికవరీ చేశామని, అదే విధంగా ఈ నెల 17న కల్లూరు మండలం కొర్లగూడెం గ్రా మంలో ఓ మహిళ మెడలో 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయినట్లు తెలిపారు. రమేష్‌తో పాటుగా దగ్గర బంధువు గణేష్ కూడా ఈ చైన్ స్నాచింగ్‌లో పాల్గొన్నాడని ఏసీపీ తెలిపారు. సత్తుపల్లి మండలంలో యాతాలకుంటలో కూడా రమేష్ చైన్ దొంగతనం చేశాడని అన్నారు. ఇలా గణేష్ 14 చైన్ స్నాచింగ్ దొంగతనాలు చేశాడన్నారు. కొర్లగూడెంలో స్నా చింగ్ కేసులో గణేష్ పాత్ర ఉందని తెలిపారు. పెనుబల్లి మండలంలో భూమి కౌలుకు తీసుకొని పనిచేస్తున్నట్లు నమ్మించి పరిసర గ్రామాలు తిరుగుతూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్ కేసులో రమేష్‌ను అదుపులోకి తీసుకోగా, గణేష్ పారిపోయాడని పేర్కొన్నారు. అతని కోసం గాలిస్తున్నామని రఘు వివరించారు. రెండు చైన్ల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, 30వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తిలో 12వేల టన్నుల రికార్డు



మాట్లాడుతున్న పీవో నరసింహారావు

సత్తుపల్లిరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఒక్కరోజులోనే అత్యధికంగా 12,814.660టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 2024-25ఆర్థిక సంవత్సరంలో రికార్డు నెలకొల్పినట్లు కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు తెలిపారు. బుధవారం ఓసీలో ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ ఈనెల 24న అన్ని రక్షణ జాగ్రత్తలు పాటిస్తూ ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో, మీ అందరి సహకారంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. మిగిలిన రోజులు కూడా ఇదే విధంగా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించి కంపనీ పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా సంతోషాన్ని అందరికీ తెలియజేస్తూ స్వీట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అయితే రోజువారీ ఉత్పత్తి సుమారు 8వేల టన్నుల కాగా 23వ తేదీన 10వేలు, 25వ 9వేలు టన్నులు ఉత్పత్తి వచ్చిందని, కాగా 24వ తేదీన మాత్రం 12,814.660టన్నులు రావడం గొప్ప విషయమని పీవో చెప్పారు. కార్యక్రమంలో ఓసీపీ అధికారులు రామకృష్ణ, మాధవరావు, గోపికిషోర్, నాయకులు భరణి, అఫ్రోజ్, సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి ఎస్ఐపై ఫిర్యాదు

- ఎస్పీకి నివేదికను అందజేసిన డీఎస్పీ చంద్రభాను

ఆళ్లపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించిన ఆళ్లపల్లి ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన సంఘటనలో ఇల్లందు డీఎస్పీ చంద్రభాను జిల్లా ఎస్పీకి నివేదిక అందజేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం, కిష్టారం(రోడ్డుగుంపు) గ్రామానికి చెందిన ఖాలీద్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి మార్చి23న ఆళ్లపల్లి మండలం, మర్కోడు గ్రామంలో ఇఫ్తార్ విందు ముగించుకుని, అదే రోజు రాత్రి 8 గంట ప్రాంతంలో కారులో స్వగ్రామం కిష్టారం వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు వాహనతనిఖీలు చేస్తుండగా, ఖాలీద్‌పాషా కారును ఆపారు. దీంతో ఖాలీద్‌పాషా స్టేషన్ ముందు స్పీడ్‌బ్రెకర్ ఉండటంతో కారును ముందుకు వెళ్లి పక్కకు పెడుతున్న క్రమంలో ఎస్ఐ తన వద్దకు వచ్చి కారు ఆపమంటే ఆపవా అంటూ.. అదుపులోకి తీసుకుని తనపై దుర్భాషలాడుతూ నా భార్య, కుటుంబ సభ్యుల ముందే తనపై చేయి చేసుకున్నాడని, ఈ క్రమంలో అడ్డు వచ్చిన నా భార్యను కూడా నెట్టివేశాడని, ఖాలీద్ పాషా చెవిపై కొట్టడంతో చెవిలో కర్ణబేరి దెబ్బతిన్నట్లు వైద్యులు కూడా గుర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా బాధితుడి భార్య మార్చి24న జరిగిన విషయంపై జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం డీఎస్పీ ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్‌పై విచారణ చేపట్టారు. ఈ విషయమై డీఎస్పీను వివరణ కోరగా ఆళ్లపల్లి ఎస్ఐ వచ్చిన ఫిర్యాదుపై విచారణ పూర్తి చేసి ఇద్దరి మధ్య జరిగిన సంఘటనపై ఎస్పీకి నివేదిక అందజేశాం. తదుపరి చర్యలపై ఎస్పీ నిర్ణయం తీసుకుంటారు అని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఖమ్మం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకుని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మంగళగూడెం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మంగళగూడెం గ్రామానికి చెందిన బోనగిరి ఉప్పలయ్య (49)కు ఒక ఎ కరం 20 గుంటల భూమి ఉంది. దీనికి తోడు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగుచేశాడు. పండిన మిర్చిని మంగళవారం ఖమ్మం మార్కెట్‌లో విక్రయించాడు. వచ్చిన డబ్బులు అప్పులకు కూడా స రిపోలేదని మనస్తాపం చెందాడు. పొలానికి వెళ్తున్నా అని ఇంట్లో చెప్పి అక్కడ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఉపేంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదైంది. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌కి చెందిన షేక్ హుస్సేన్‌కు, షేక్ మోహిన్‌కాన్‌కు మధ్య మసీదు నిర్వహణ విషయంలో ఈనెల 23న ఘర్షణ చోటుచేసుకుంది. హుస్సేన్ అతని తండ్రి బషీర్ ఈ నెల 25వ తేదీ సాయంత్రం మసీదుకు వెళ్తుండగా గతంలో జరిగిన ఘర్షణను దృష్టిలో పెట్టుకుని మార్గమధ్యలో షేక్ మోహిన్ ఖాన్, అతని కుమారులు ఇమ్రాన్, రిజ్వాన్‌లు వారిపై దాడి చేశారు. తమను చంపాలనే ఉద్దేశ్యంతో తమపై దాడి చేశారని హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోహిన్‌ఖాన్, ఇమ్రాన్, రిజ్వాన్‌పై కేసునమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

కోలుకుంటున్న కూలీలు

జూలూరుపాడు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాళపాడు, పెద్దవాగులో ట్రాలీ ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో గాయపడిన కూలీలు కొత్తగూడెం, హైదరాబాద్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తనయుడు విఘ్నేష్‌నాయక్ కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో గాయపడ్డ చీపురుగూడేనికి చెందిన సోడే రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చీపురుగూడేనికి చెందిన సోడే లక్ష్మీనర్సును వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. టాక్యాతండాకు చెందిన బాణోత్ సురేష్ ఖమ్మంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతారు. కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 22మంది కూలీలు చికిత్స పొందుతుండగా వైద్యులు ఐదుగురిని డిశ్చార్జ్ చేశారు. మరో 17 మంది గాయపడ్డ కూలీలు కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.



'రైతు ఆత్మహత్యలకు పాలకులే కారణం'

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదినేని రమేశ్ పేర్కొన్నారు. నగరంలోని బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. దేశానికి వెన్నముక రైతేనని అటువంటి రైతు సేద్యం చేసిన వ్యవసాయానికి గిట్టుబాటు ధర కల్పించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. రైతులు పండించిన పంటలను నూరుశాతం ప్రభుత్వాలే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీవీకే మెనేజరు వై శ్రీనివాసరావు, ఎం సుబ్బారావు, అఫ్జల్‌మియా, రామారావు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌లకు రూ.32.44కోట్లు

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నిధులు



కూసుమంచి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో ఆరు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.32.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్లు పిలవడానికి అవసరమైన అనుమతులతో జీవోను విడుదల చేసింది. ఖమ్మంరూరల్ మండలం రఘునాథపాలెం మండలం జాన్‌బాద్‌తండాకు రూ.6.38 కోట్లు, ఊటవాగుతండాకు రూ.6.75కోట్లు, కూసుమంచి మండలం జక్కేపల్లికి రూ.5.79కోట్లు, నేలకొండపల్లి మండలం చెన్నారంలో రూ.6.65కోట్లు, పైనంపల్లికి 4.33 కోట్లు, సదాశివపాలెం వద్ద రూ.2.54కోట్లు, మంజూరయ్యాయి. పాలేరు నియోజకవర్గంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధుల మంజూరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత సర్వీస్ అభినందనీయం



సేవలను వినియోగించుకుంటున్న వినియోగదారులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల కోసం క్రాంప్టన్ గ్రీవెన్స్ కన్జ్యూమర్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సౌజన్యంతో నగరంలోని వైరారోడ్‌లో సోమ, మంగళవారాల్లో ఆ కంపెనీ ఫ్యాన్లు, గీజర్లు, మిక్సీలు, ఐరన్‌బాక్సులు, మోటారు పంపుసెట్ల వంటి పరికరాలకు ఉచిత సర్వీసింగ్ కల్పించారు. హైమావతి టెలీ సిస్టమ్స్, శ్రీశ్రీమార్కెటింగ్ వెంకటరమణ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఓంకార్ ఎంటర్‌ప్రైజెస్ ఖమ్మం వారు రెండు రోజులపాటు ఉచిత సర్వీస్ నిర్వహించటం అభినందనీయమని పలువురు వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో మాయగాళ్లు



» కూరగాయల మార్కెట్ అక్రమార్కులపై చర్యలేవి?
» నోటీసులు ఇవ్వడానికి కూడా వెనుకంజ
» రాజకీయ ఒత్తిడితో తలొగ్గిన అధికారులు
» ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిర్మాణాలు
» కాల్వొడ్డు పాత కూరగాయల దుకాణాలు ఇప్పటికీ వారి చేతుల్లోనే..

ఖమ్మం మార్కెట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చూడటానికి అదో కూరగాయల వ్యాపారం. .. అక్కడ జరిగేది మాత్రం పెద్ద మాఫియా వ్యవహారం. అదేనండి.. నగరంలోని రాపర్తినగర్‌లో గల ప్రధాన కూరగాయల హోల్ సేల్ మార్కెట్‌లో పరిస్థితి. అక్కడ అర్ధరాత్రి జరిగే లావాదేవీలు పలువురు వ్యాపారులకు కాసులు కురిపించే చీకటి సామ్రాజ్యంగా తయారైంది. అక్కడ వ్యాపారులు మార్కెట్ మొత్తాన్ని శాసిస్తారు. వారు చెప్పిందే వేదం. వారు చెల్లించేదే ఫీజు. దీంతో మార్కెట్ ఆదాయం రోజు రోజుకూ తగ్గి గండి పడుతుండగా వారు మాత్రం కోట్లకు పడగలెత్తారు. ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడతారు. ఖాళీ జాగాలను వారి హవాలాలోకి తీసుకుంటారు. రాజకీయ అండతో మార్కెట్ అధికారులను బెదిరిస్తారు. ఇది.. మార్కెట్‌లో జరిగే అసలు తంతని భారీగా విమర్శలు సైతం వస్తున్నాయి. మార్కెట్‌లో ఉన్న సుమారు 48 షాపులలో కేవలం నలుగురు వ్యాపారుల చేతుల్లో సుమారు సగానికి పైగానే దుకాణాలు ఉన్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోపోవడంతో పెద్ద మాఫియాలా తయారైంది ప్రధాన కూరగాయల మార్కెట్.

ఆదాయంపైనా అధికారుల ఆరా

ఈ పరిస్థితి నుంచి మార్కెట్‌కు విముక్తి కల్పించేందుకు నూతనంగా ఏర్పడ్డ మార్కెట్ కమిటీ పాలక వర్గం, అధికారులు ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నారు. మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టే సుమారు 20 మంది అక్రమార్కులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. అంతేకాకుండా మార్కెట్‌కు చెల్లించే ఫీజు తగ్గించి చెల్లిస్తున్న వ్యాపారులు, మార్కెట్ ఆదాయానికి గండి పెడుతూ ప్రభుత్వాన్ని మభ్య పెడుతున్న వ్యాపారులపై దృష్టి సారించారు. ప్రధాన కూరగాయల హోల్ సేల్ మార్కెట్‌లో సాధారణంగా అర్ధరాత్రి లావాదేవీలు జరుగుతాయి. పంట ఎంత వచ్చినా వారు మార్కెట్ నియమ,నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజు చెల్లించరు. సరుకుతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లారీకి కేవలం రూ. 100నుంచి రూ. 150 మించి చెల్లించరు. వారు చేసే వ్యాపారం రోజుకు లక్షల్లో ఉన్నా వారు మార్కెట్‌కు జీరో వ్యాపారం చూపిస్తుంటారు. నామమాత్రపు ఫీజును మార్కెట్ సిబ్బంది చేతుల్లో పెట్టి చేతులు దులుపుకొంటారు. వారు నిర్వహించే దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు సైతం సకాలంలో చెల్లించరు. అలాంటి అక్రమార్కులను గతంలోనే ఏరివేసే చర్యలు ప్రారంభించినప్పటికీ రాజకీయ ఒత్తిడితో వారి పై చర్యలు తీసుకునేందుకు అధికారులు సాహసించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ప్రధాన కూరగాయల మార్కెట్ లో అక్రమంగా నిర్మించిన షెడ్డు

కాల్వొడ్డు దుకాణాలు వారి చేతుల్లోనే..

బుర్హాన్‌పురంలో ప్రస్తుత హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ ప్రారంభించక ముందు గతంలో కాల్వొడ్డు ప్రాంతంలో ప్రస్తుతం రింగ్ సర్కిల్ ఉన్న ప్రదేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల కింద నిర్మించిన సుమారు 30నుంచి 40 దుకాణాలు కూరగాయల వ్యాపారాల కోసం నెలకు రూ.300 నామమాత్రపు అద్దెతో ఇచ్చారు. అనంతరం 2005లో బుర్హాన్‌పురంలో ప్రధాన కూరగాయల మార్కెట్ నిర్మించి ప్రారంభించిన తరువాత అక్కడి వ్యాపారులకే ఇక్కడ దుకాణాలు కేటాయించినా పాత కాల్వొడ్డు దుకాణాలు మాత్రం ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. అవి ఇప్పటికీ వారి చేతుల్లోనే ఉన్నాయి. వారు ఆయా దుకాణాలను ఇతరులకు నెలకు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన నామమాత్రపు అద్దెను సైతం చెల్లించకుండా అదనపు ఆదాయాన్ని గడిస్తున్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రధాన కూరగాయల మార్కెట్ గేట్



భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

తీగల వంతెన కోసం..

ఖమ్మం కలెక్టరేట్, మార్చి26(ఆంధ్రజ్యోతి): నగరంలో మున్నేరుపై రూ.180కోట్లతో రూపుదిద్దుకొంటున్న తీగల వంతెన నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాల్వొడ్డు శ్మశాన వాటికకు అనుసంధానంగా నిర్మించిన కర్మకాండల భవనాన్ని బుధవారం కూల్చి వేశారు. వైకుంఠధామానికి అనుసంధానంగా ఉన్న రెండు షాపులను కూడా ఇప్పటికే కూల్చి వేశారు.

ఐకమత్యంతో ఉండాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా బుధవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ప్రజలు ఐకమత్యంతో, సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. ముస్లిం మత పెద్దలకు, ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు..

ఘనంగా ఉర్సు ఊరేగింపు



ఊరేగింపులో ముస్లిం మత పెద్దలు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శుక్రవారపేటలోని హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షావలి బాబా ఉర్సు ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తుమ్మలగడ్డలోని దర్గా సేవకుడు తాజ్‌బాబా ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరి మోమినాన్ పాఠశాల, శుక్రవారపేట సెంటర్, రిక్కాబజార్ సెంటర్, శివాలయం మీదుగా దర్గాలోకి ప్రవేశించారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వాలు

» పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం
» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్ రావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల్ని విస్మరించాయని, దేశంలో ఇప్పటికి 70శాతం మంది రైతులు వ్యవసాయమే జీవనాధారంగా సాగు చేస్తున్నారని, కేవలం రైతాంగ పోరాటాల ద్వారానే రైతుల సమస్యలు పరిష్కారం జరుగుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయటం ద్వారానే వ్యవసాయ రంగానికి ఊతం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు వరాల జల్లు కురిపించి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోవటం లేదని ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవటంతో దేశంలో రైతు ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతి రోజు 36 రైతు ఆత్మహత్యలు నమోదు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించేందుకు అనేక రాయితీలు, ప్రోత్సహకాలను అందిస్తున్నాయని వివరించారు. ఏప్రిల్‌లో ఉద్యమాల మాసంగా ప్రకటించి ఇంటింటి ప్రజా సమస్యల సర్వేలు చేపడ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచర్ల భారతి, బండి రమేశ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేశ్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని తాగునీరు సరఫరా చేయాలని, ప్రతీ విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. బుధవారం జరిగిన గణితం పరీక్షకు మొత్తం 16,417 మందికి 16,388 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని డీఈవో తెలిపారు. ఆరు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి, 36 పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

కామేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలంలోని కొత్తలింగాల శ్రీకోటమైసమ్మ అమ్మవారి జాతర మహోత్సవ పోస్టర్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 29 నుంచి 31 వరకు అమ్మవారి జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లమోతు శేషయ్య తెలిపారు. మార్చి 29న మంగళతోరణం, విఘ్నేశ్వర పూజ, కుంకుమ పూజ, మండపారాధన మార్చి 30న అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, మండవ పూజ మంత్రపుష్పం ఉగాదిన అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.



సంఘీభావం తెలుపుతున్న కార్పెంటర్ సంఘం నాయకులు

' కార్పెంటర్ల సమ్మె విజయవంతం '

ఖమ్మం చర్చికాంపౌండ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా నగరంలో నిర్వహిస్తున్న కార్పెంటర్ల సమ్మె విజయవంతం అయిందని కార్పెంటర్స్ యూనియన్ల జేఏసీ కన్వీనర్ బాణాల చిన్న వీరబ్రహ్మాచారి తెలిపారు. బుధవారం మోతినగర్ ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమ్మె ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నగరంలో పనిచేసే కార్పెంటర్స్ మేస్త్రీల సమస్యల పరిష్కారానికి, పనిరేట్ల పెరుగుదలకు పదిరోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెను విజయంతంగా నిర్వహించామన్నారు. కార్పెంటర్ల సమస్యల పరిష్కారానికి ధరలు పెరుగుదలపై మూడు సంఘాల ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. పెరిగిన ధరలు పటిష్ఠంగా అమలు అమలు చేయడానికి కార్పెంటర్ మేస్త్రీలు ఐక్యంగా ఉండి ఒకే ధర తీసుకోవాలన్నారు. ఈసమ్మె విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో కార్పెంటర్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ ఖమ్మం అధ్యక్షుడు దోనోజు పాపాచారి, ప్రధాన కార్యదర్శి దిగజర్ల వెంకన్న, కార్పెంటర్స్ అసోసియేషన్ ఖమ్మం అధ్యక్షుడు బాణాల వీరబ్రహ్మాచారి, సోమా నాగరాజుకుమార్, దోనోజు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ హాజరు పరిశీలన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల పని గంటలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టి సారించారు. కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ ఫేస్ హాజరు మిషన్ల ద్వారా ఉద్యోగుల హాజరును బుధవారం పరిశీలించారు. ఉదయం ఎన్ని గంటలకు వస్తున్నారు.. తిరిగి సాయంత్రం ఎన్ని గంటలకు వెళ్తున్నారు అనే విషయాలపై ఆరా తీశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నబీ

ఖమ్మంరూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావును రూరల్ మండలానికి చెందిన మాజీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధా కార్యదర్శి షేక్ నబీ బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో కురుమలకు స్థానం కలిపించాలని ఖమ్మం నగర కురుమ సంఘం అధ్యక్షుడు దేవర వెంకన్న పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో బీసీలలో అత్యంత వెనుకబడిన కురుమ కులానికి చెందిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు స్థానం కలిపించి ప్రభుత్వం బీసీలను గుర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి మాలిగ గౌరీశంకర్, చిందం సైదులు, దయ్యాల రామమల్లేశం, కాటం కొమరయ్య, జెట్ట క్రిష్ణయ్య, మరాటి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

29న ఉగాది కవి సమ్మేళనం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నగరంలోని మంచికంటి భవన్‌లో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాంకుమార్, రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సామాన్యుడు- పండుగ ' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, 99490 83327, 98495 35033 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రిన్సిపాల్స్ సంఘం డైరీ ఆవిష్కరణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సంఘం డైరీని బుధవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జాకీరుల్లా, పద్మావతి, చిన్నప్పయ్య, జాన్‌మిల్టన్ పాల్గొన్నారు.

నేడు టీఎన్జీవోస్ భవన్‌లో ఇఫ్తార్ విందు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీజీజేఏసీ ఆధ్వర్యంలో టీఎన్జీవోస్ భవన్లో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఇఫ్తార్ విందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగ అన్ని శాఖల ముస్లింలు పాల్గొనాలని ఆయన కోరారు. ముస్లిం మైనార్టీ ఉద్యోగులు, అన్ని ఉద్యోగ సంఘ నాయకులు హాజరు కావాలని చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కోచైర్మన్ కస్తాల సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు.

పంటలు ఎండిపోకుండా సాగునీరు

తిరుమలాయపాలెం, మార్చి26(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని రైతులు సాగుచేసిన పంటలకు సాగునీరు అందిస్తున్నట్టు జేడీఏ పుల్లయ్య తెలిపారు. బుదవారం మండలంలోని ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, బచ్చోడు, తదతర గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20రోజులు వరకు ఎటువంటి నీటి కొరత ఉండదని, రైతులు నీటిని పొదుపుగా వాడుకుని పంటలు పండించుకోవాలన్నారు.

పారితోషికం విడుదల చేయాలి

కూసుమంచి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కులగణన కుటుంబ సర్వే విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్స్ కోసం అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని, పారితోషికం విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మండవ నర్సయ్య కోరారు. ఈమేరకు కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీకి ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న దయాకర్‌రెడ్డి

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

» పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, మార్చి26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి కోరారు. బుధవారం నేలకొండపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 16మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, సీతరాములు, రమేష్, బొడ్డు బొందయ్య, రేగూరి వాసవి, షేక్.ఖాజామియా, బచ్చలకూర నాగరాజు, మక్త్యాల రామకృష్ణ, రాయపూడి నవీన్ పాల్గొన్నారు.

28న రైతు సత్యాగ్రహ దీక్ష: బీజేపీ

ఖమ్మం బైపాస్‌రోడ్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రైతుల న్యాయమైన డిమాండ్ల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో రైతు సత్యాగ్రహ దీక్ష కోసం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతుల సంక్షేమం కోరుతూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు దీక్షలు చేపట్టాలని కిసాన్ మోర్చా నిర్ణయించిందని, ఇందులో భాగంగా ఈనెల 28న కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో సత్యాగ్రహదీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చిలుకూరి రమేష్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, నల్లగట్ల ప్రవీణ్, వెంకటేశ్వరరావు, శ్యాంసుందర్, యల్లారావుగౌడ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలుచేయాలి: సీపీఎం

కూసుమంచి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను వెంటనే అమలు చేయాలని కూసుమంచి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకుడు బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని, యాసంగి పంటకు రైతుభరోసా అందించాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఖమ్మంజిల్లాలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలని పక్కా ఇళ్లు మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోటకూరి రాజశేఖర్, షన్మతిరావు, గంగాధర్, భారతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు న్యాయం చేసేది బీజేపీనే..

» బీజేపీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు షర్ఫుద్దీన్

నేలకొండపల్లి, మార్చి26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలోనే ముస్లింలకు పూర్తి న్యాయం జరుగుతుందని బీజేపీ మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్ షర్ఫుద్దీన్ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలందరకూ రంజాన్ తోఫా కిట్లను అందించాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించటం అభినందనీయమన్నారు. రంజాన్ ముస్లింలకు ఎంతో పవిత్రమైన పర్వదినమని, రంజాన్ వేళ ముస్లింలకు రంజాన్ తోఫా అందించటం గొప్ప విషయమన్నారు. భారత్ ప్రపంచంలోనే గుర్తింపు తెచ్చుకున్న దేశంగా మారటంలో మోదీ ఎంతో క్రియాశీలంగా వ్యవహరించారన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం: ఎస్ఐ

నేలకొండపల్లి, మార్చి26 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని కార్మిక వర్గం ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. తెలంగాణా ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ సంతోష్ ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న వేళ, ప్రజలకు చల్లని తాగునీరు అందించటానికి కార్మికులు ఏర్పాటు చేసిన చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం సమాజాన్ని డ్రగ్స్ మహమ్మారి పట్టి పీడిస్తున్నదని, యువత మత్తు మందులకు బానిసలవుతున్నారన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండేలా కార్మికులు చూడాలన్నారు. కార్యక్రమంలో షేక్ యాకోబ్, రాజపుత్ర జనార్ధన్ సింగ్, పిచ్చయ్య, వెంకన్న, సాలయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అశ్రమపాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లిలోనే ఆశ్రమ పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు అందిస్తున్న వసతులను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో రవీంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం సరఫరా

సత్తుపల్లిరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 61ప్రభుత్వ పాఠశాలలకు 6123మీటర్ల యూనిఫాం క్లాత్‌ను స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేసినట్లు ఎంఈవో నక్కా రాజేశ్వరరావు బుధవారం తెలిపారు. మొత్తం 3,386మంది విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాంను మే 20వ తేదీ కల్లా అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యవర్ధన్‌రాజు, కాంప్లెక్స్ హెచ్ఎం శైలకుమారి, జయరాజు, పూరేటీ యాకోబు, హెచ్ఎం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

కారేపల్లి, మార్చి26(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ హామీ పథకానికి సంబంధించి రెండు రోజులుగా ఉపాధిహామీ ప్రజా వేదిక నిర్వహించారు. నివేదికల ఆధారంగా రూ.2 లక్షల37వేలకుపైగా రికవరీ చేయాలని జిల్లా అడిషనల్ పీడీ చుంచు శ్రీనివాస్‌రావు ఆదేశాలు జారీచేశారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ప్రజావేదిక బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవింద్రప్రసాద్, ఏపీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

మధిర రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దెందుకూరు, ఖమ్మంపాడు గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యుడు పృథ్వీరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో వడదెబ్బపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ప్రజలు వడదెబ్బ బారీనపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ లంకా కొండయ్య, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

మధిర రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంఈవో వై.ప్రభాకర్ తెలిపారు. బుధవారం మధిర మండలం నాగవరప్పాడు గ్రామంలో యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మధిర రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషకాహార, నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధిర మండల ప్రత్యేక అధికారి ఏ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మధిర మండలం రాయపట్నం గ్రామంలోగల యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సందర్శించారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం డేవిడ్ రాజు, ఉపాధ్యాయులు అజయ్‌కుమార్, విజయ, జనార్ధన్‌రెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

వైరా మునిసిపల్ బడ్జెట్ రూ.7.40కోట్లు

వైరా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2025-2026 ఆర్థిక సంవత్సరానికి వైరా మునిసిపల్ బడ్జెట్‌ను రూ.1918.87లక్షలకు ప్రతిపాదిస్తూ కలెక్టర్ ఆమోదానికి పంపించారు. పాలకవర్గం లేకపోవడంతో మునిసిపల్ ప్రత్యేక అధికారి శ్రీజ అనుమతితో మునిసిపల్ కమిషనర్ చింతా వేణు కలెక్టర్ ఆమోదానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.45.13లక్షల మిగులుతో ఈ అంచనాలు పంపించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నాటికి అంచనా ప్రారంభ నిల్వ రూ.2.96కోట్లకు, సాధారణ ఆదాయం రూ.444.10లక్షలు మొత్తం సాధారణ ఆదాయం రూ.740.10లక్షలుగా, ఈ ఆర్థిక సంవత్సరంలో క్యాపిటల్ ఆదాయం రూ.1178.77లక్షలకు మొత్తం ఆదాయం రూ.1918.87లక్షల ఆమోదానికి ప్రతిపాదనలు వెళ్లాయి.

వీటిలో సాధారణ వ్యయం రూ.694.97లక్షలు, క్యాపిటల్ వ్యయం రూ.9.10కోట్లు, మొత్తం వ్యయం రూ.1161.77లక్షలకు మిగులు రూ.45.13లక్షల తో బడ్జెట్ ఆమోదానికి కలెక్టర్‌కు ప్రతిపాదించారు.

పనులు ప్రారంభమయ్యేదెన్నడో..

» ఎనిమిదేళ్ల క్రితం మహిళా సమాఖ్య కార్యాలయానికి శంకుస్థాపన

» పట్టించుకోని అధికారులు

తల్లాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ భవన నిర్మాణంలో ముందడుగు పడటం లేదు. ఇప్పటికీ ఇద్దరు కాంట్రాక్టర్లు మారినప్పటికీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలోనే సొంత భవనం లేని మండల మహిళా సమాఖ్య కార్యాలయం దుస్థితి ఇది. మండల కేంద్రమైన తల్లాడలోని మండల మహిళా సమాఖ్య (స్త్రీశక్తి, ఉపాధి హామీ)భవన నిర్మాణ దుస్థితి. తల్లాడ-వరంగల్ జాతీయ రహదారి పక్కనున్న నారాయణపురం పాత ప్రాథమిక పాఠశాల స్థలంలో స్త్రీశక్తి భవన నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ 2011-12 కింద రూ.25 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి 2017 అక్టోబరు 29వతేదీన అప్పటి ఆర్అండ్‌బీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులను స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. సంబంధిత కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆకాంట్రాక్టర్ కూడా భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. భవన నిర్మాణంలో ఏళ్ల తరబడి కాలయాపన జరగడంతో అంచనా వ్యయం పెరగడంతో మూడేళ్ల క్రితం రూ.25లక్షలకు అదనంగా స్థానిక సంస్థల అభివృద్ధి నిధుల నుంచి మరో రూ.ఏడులక్షలు కేటాయించారు. అయినప్పటికీ నేటివరకు స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం తల్లాడలోని పురాతన అద్దె భవనంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతినెలా రూ.4,500అద్దె చెల్లిస్తున్నారు. కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక నిత్యం కార్యాలయానికి వచ్చే డ్వాక్రా మహిళలు నరకయాతన పడుతున్నారు. తల్లాడ మండలంలో 14వేలమంది మహిళలు డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. 1400డ్వాక్రా గ్రూపులున్నాయి. 52మంది గ్రామదీపికలు, ఆరుగురు క్లస్టర్ కోఆర్డినేటర్లు ఉన్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకు రుణాలతోపాటు ఇతర అ వసరాల కోసం మండలంలోని వివిధ గ్రామా ల నుంచి మండల సమాఖ్య కార్యాలయానికి నిత్యం వస్తుంటారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే మహిళలు అవస్థలు పడుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం సాక్షాత్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసిన స్త్రీశక్తి భవన నిర్మాణాన్ని ఇప్పటికైనా పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్య లు తీసుకోవాలని మండల డ్వాక్రా మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



స్త్రీశక్తి భవనం కోసం కేటాయించిన స్థలం



కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

శ్రీరాముడి కల్యాణ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ముదిగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 6న జరుగనున్న శ్రీరాముని కల్యాణ మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాముని కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని భట్టి విక్రమార్కను ఆహ్వానించారు. ఈ కల్యాణ మహోత్సవానికి హాజరవుతానని భట్టి తెలిపినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి సమత, ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ చైర్మన్ తుళ్లూరు జీవన్, అజయ్, వీరభద్రం, తిరపయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ సునీల్‌రెడ్డి

సత్తుపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఈనెల 29వ తేదీలోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను మండల ప్రత్యేక అధికారి టీ.సునీల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వరికోతలు ప్రారంభమైన దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆవశ్యకత ఉందని, కేంద్రాల వద్ద వేసవిని దృష్టిలో ఉంచుకుని కుర్చీలు, టెంట్లు, మంచినీరు వంటి మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, ఎంపీవో కృష్ణ, ఏవో వై.శ్రీనివాసరావు తదితరులున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

» సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చింతకాని, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. బుధవారం మండల కేం ద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నా లో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కా ర్యక్రమంలో రాచ బంటి రాము, వత్సవాయి జానకిరాములు, మడిపల్లి కిరణ్ బాబు, నన్నక కృష్ణమూర్తి, గడ్డం రమణ, మాదిన్ని రవి, గడ్డం కోటేశ్వరరావు, దేశబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు: ఇద్దరికి గాయాలు

మధిర రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి వద్ద కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన షేక్.రఫీ, విజయవాడకు చెందిన ప్రసాద్‌లు బుధవారం సాయంత్రం పెనుగంచిప్రోలు నుంచి మధిరకు కారులో వస్తున్నారు. మార్గమధ్యలో మడుపల్లి-మధిర మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై వేగంగా వీరి కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో పెనుప్రమాదం తప్పిపోయింది. కారులో ఉన్న రఫీ, ప్రసాద్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మధిర టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దుమ్ము, ధూళి నివారణకు చర్యలు

» సింగరేణి డైరెక్టర్ (పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు

సత్తుపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బ్లాస్టింగ్ చేసేటప్పుడు దుమ్మధూళీ నివారణకు అరికట్టే సమయంలో అన్నిరకాల చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పీపీ) కొప్పుల వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని కిష్టారం ఓసీపీతో పాటు జేవీఆర్ సీహెచ్‌పీని ఆకస్మికంగా సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, నాణ్యత విషయాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఓసీ గనుల్లో కోల్ బెంచ్‌లు, రిపేర్ యంత్రాల యొక్క పనిస్థలాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా జేవీఆర్ ఓసీపీ చుట్టూ, సైలోబంకర్ చుట్టూ ఉన్న విండ్ బ్యారియర్ ఎత్తు పెంచాలని, సీహెచ్‌పీ చుట్టూ గ్రీన్ బ్యారియర్ ఏర్పాటు చేసే విధంగా మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం షాలెంరాజు, పీవోలు ఎంవీ.నరసింహారావు, ప్రహ్లాద, అధికారులు సోమశేఖర్, కోటిరెడ్డి, సత్యనారాయణ, రమణ, బుడగం రామకృష్ణ, గోపీకిషోర్, బాబు, డీ.శ్రీనివాస్, విజయసందీప్ తదితరులున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు



అజయ్‌ను పరామర్శిస్తున్న సండ్ర, నాయకులు

మాజీ జడ్పీటీసీ అజయ్‌కు సండ్ర పరామర్శ

కల్లూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ఇటీవల కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకొని స్వగ్రామం రాగా, సమాచారం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం పోచారంలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ ఆరోగ్యక్షేమాలను గురించి సండ్ర అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాల అధ్యక్షులు బోబోలు లక్ష్మణరావు, నర్వనేని అంజయ్య, చావా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, ఎస్‌కె కమ్లి, పెదకంటి రామకృష్ణ, కిరణ్‌కుమార్, అజ్మీర జమలయ్య, కొమ్మూరి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల అందజేత



విశిష్ట సేవకులను సన్మానిస్తున్న దృశ్యం

వైరా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశిష్ట సేవలందించిన వందమందికి బుధవారం ఉగాది పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మెండెం ఇసాక్‌బాబు ద్వితీయ వర్థంతిని కూడా నిర్వహించారు. ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి పూర్ణకంటి రామారావు, నిర్వాహకుడు ఓర్సు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పురస్కారాల వేడుకలు జరిగాయి. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, చింతకాని తహసీల్దార్ అనంతరాజు, వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, నాయకులు ధార్న రాజశేఖర్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, కంకణాల అర్జున్‌రావు, బీవీఎస్.నారాయణ, కుటుంబరావు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన

బోనకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నమ్ చందర్ మాట్లాడారు. బాలల పరిరక్షణ మండల కమిటీ కన్వీనర్‌గా సీడీపీవో బాల త్రిపుర సుందరి, చైర్మన్ మండల ప్రత్యేకాధికారి కడారి విజయ్‌బాస్కరరెడ్డి, కార్యదర్శి ఎంఈవో దామాల పుల్లయ్య, మండల అధికారులు కమిటీ సభ్యులుగా నియమించబడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రీ, లేబర్ అసిస్టెంట్ అధికారి చందన్ కుమార్, ఎండీ లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కల్లూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా కల్లూరులోని జామే మసీద్ ప్రాంగణంలో బుధవారం ఉపవాస దీక్షపరులకు ప్రభుత్వంచే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపవాసదీక్షపరులతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, ఏసీపీ రఘు, సీఐ ముత్తు లింగయ్య, ఎస్ఐ హరిత, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, సయ్యద్‌అలీ, ఎండీ. హనీఫ్. ఎస్ కె ఉస్మాన్, తురాబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

బోనకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన బాగం శ్రీలక్ష్మికి ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారుసుతో మంజూరైన చెక్కును టెలికాంబ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఉమ్మినేని కృష్ణ అందజేశారు. పలు కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు షేక్ ఇమామ్, హారిక నాయుడు, బాగం నాగేశ్వరరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలదే బంగారు భవిష్యత్

● డీఎంహెచ్‌వో కళావతిబాయి



వైరాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లికి స్వీట్ బాక్సు అందజేస్తున్న కస్తాల సత్యనారాయణ

బోనకల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలకు సముచిత గౌరవంతో పాటు ప్రాధాన్యతను పెంచడమే గర్ల్‌ఫ్రైడ్ లక్ష్యమని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి బాణోతు కళావతిబాయి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం గర్ల్‌ఫ్రైడ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో జెర్రిపోతుల బాబు, సౌజన్య దంపతులకు పాప పుట్టడంతో వారి ఇంటికి వెళ్లి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్లు మందా దానయ్య, లింగంపల్లి శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, రమాదేవి, కార్యదర్శి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం: మండలంలోని ఎర్రుపాలెం, బనిగండ్లపాడు, చొప్పకట్లపాలెం గ్రామాల్లో జడ్పీ సీఈవో దీక్షారైనా బుధవారం పర్యటించారు. చొప్పకట్లపాలెం గ్రామంలో ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చిన జి.శివరామకృష్ణ పావని దంపతులను కలిసి సన్మానించి స్వీటు బాక్సు అందించారు. ఈకార్యక్రమంలో మండలప్రత్యేక అధికారి అబ్దుల్ అలీమ్, ఎంపీడీవో సురేందర్, ఎంఈవో మురళీమోహన్, ఏసీడీపీవో కృష్ణశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు ఏలేశ్వరరావు, అశోక్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో....

కల్లూరు: రానున్న రోజుల్లో ఆడపిల్లలదే బంగారు భవిష్యత్ అని కల్లూరు మండల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ జన్మోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరులోని డబల్ బెడ్ రూం గృహాల వద్ద ఆడపిల్లకు జన్మనిచ్చిన కండ్రాతి అశ్విని దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో నిర్మలజ్యోతి, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చం ద్రశేఖర్, ఏసీడీపీవో రత్నమ్మ, పంచాయతీ ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సుజాత, భవానీ, వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్ జమున పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికల పట్ల ఉన్న చిన్నచూపు తొలగిపోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ పీ.సునీల్‌రెడ్డి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బుగ్గపాడులో గర్ల్‌ఫ్రైడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కీసరి లలిత, రాజేష్ దంపతులకు ఆడపిల్లకు జన్మనివ్వడంతో శాలువాతో సన్మానించిన కరపత్రంతో పాటు స్వీట్‌బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, ఎంపీవో కృష్ణ, సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు కల్యాణి, నాగమణి, నాగలక్ష్మి, అలివేలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పెనుగొండ స్వాతి, గోపాలకృష్ణ దంపతులకు ఈనెల 7న ఆడపిల్ల జన్మించినందుకు వారి ఇంటికి వెళ్లి దంపతులను శాలువ, ప్రశంసాపత్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఉషారాణి, ఎంపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, అరుణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, అంగన్‌వాడీ టీచర్‌లు ఝాన్సీ, శివరంజని, కళావతి, పిచ్చమ్మ, ఆశా సుజాత తదితరులున్నారు.

వైరాలో....

వైరా: వైరాలో బంగారు తల్లి కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యంలో బంగారుతల్లి కార్యక్రమంలో భాగంగా ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తల్లికి స్వీట్ బాక్సు అందజేసి ఆమెను వారి తల్లిదండ్రులను సన్మానించారు. వైరా మునిసిపాలిటీ ఒకటోవార్డు ఆర్‌సీఎం చర్చి సమీపంలో సన, జావీద్ సంతానమైన ఆడబిడ్డ ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి, బీజాన్‌బీ, అంగన్‌వాడీ టీచర్లు సరిత, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు: ఏన్కూరు హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి సాయినాథ్ ప్రారంభించారు. ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు సన్మానపత్రం, స్వీట్ బాక్సులను అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ టీ.కృష్ణ, కార్యదర్శి బి.రామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, తదితరులు పాల్గొన్నారు

ముదిగొండలో...

ముదిగొండ: మండలంలోని వల్లభి గ్రామానికి కొత్తపల్లి మౌనిక, కృష్ణ దంపతులకు ఆడపిల్ల పుట్టగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదంపతులను సన్మానించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి, వైద్యాధికారి ధర్మేందర్, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ శాంతి, సూపర్‌వైజర్ రాజకుమారి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, బీయమ్మ, తిరుపతమ్మ, నిర్మల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి



ఎర్రుపాలెంలో ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జడ్పీసీఈవో దీక్షారైనా



ముదిగొండలో..



ఏన్కూర్‌లో...



సత్తుపల్లిలో...



కొణిజర్లలో..



కల్లూరులో...

ఎరక్కపోయి ఇరుక్కున్న దూడ

ముదిగొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలోని ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ఏర్పాటుచేసిన రెయిలింగ్‌లో ఓ బర్రె దూడ ఇరుక్కుపోయింది. జాతీయ రహదారిపై రెయిలింగ్ ఏర్పాటుచేయగా బర్రె దూడ దానిలో నుంచి పోవడానికి ప్రయత్నించి ఇరుక్కుపోయింది. గమనించిన రైతు హైవే సిబ్బందికి తెలపగా రెయిలింగ్ కడ్డీని కట్ చేసి దూడను బయటకు తీశారు.

